# విముక్తి

అతన్ని చంపేస్తే బావుండునని ఆమె మరోసారి అనుకుంది. అలాంటి ఆలోచన రావటం ఆమెకిది మొదటిసారి కాదు... గత నెల్రోజుల్నుంచీ ఆమె మనసుని తొలుస్తూ అదే ఆలోచన... ఆ రోజు అలా అనుకోవటం నాలుగోసారి...

అతను ఆమె భర్త... ముప్పై ఐదేళ్ళు కలిసి కాపురం చేసిన భర్త

ఎలా చంపాలీ... గొంతు నులిమి చంపేస్తే...అమ్మో...కళ్ళు తెరిచి తన కళ్ళలోకి వేదనగా చూస్తే తను తట్టుకోగలదా? లేదు. అప్పుడు చేతులు వణుకుతాయి. పట్టు జారుతుంది. మనసు కరిగిపోతుంది. విషం కలిపి తినిపిస్తేనో... అతను గిలగిలా కొట్టుకుంటుంటే తన ప్రాణం విలవిల్లాడిపోదూ... అప్పుడే అమృతమిచ్చి బతికించుకోగలదు? నిద్ర మాత్రలు ఎక్కువ మోతాదులో కలిపిస్తేనో... నిద్రలోనే శాశ్వత నిద్రలోకి జారుకుంటాడు.

అతనికి దగ్గుతెర వచ్చినట్లుంది. ఎడతెరిపి లేకుండా దగ్గు...అలానే వూపిరాడకుండా చచ్చిపోతే ఎంత బావుండు అనుకుందామె. మంచినీళ్ళ గ్లాసుతో అతనున్న గదిలోకి వెళ్ళింది. దగ్గుతెరకేమో అతని కళ్ళనిండా నీళ్ళు... ఆమెకు చప్పున జాలేసింది. గుండెల్లో పదిలంగా దాచుకున్న ప్రేమ ఒక్కుమ్మడిగా పెల్లుబికి ఆమెని ఉక్కిరి బిక్కిరి చేసింది.

దిండుని సర్ది అతన్ని జరిపి తల ఎత్తుమీద ఉండేలా చేసి గ్లాసుతో నీళ్ళు తాగించింది. చీర చెంగుతో పెదాలమీది తడిని తుడిచింది. అతను చూసిన చూపు ఆమె గుండెల్లో మరోసారి అలజడిని లేపింది. కృతజ్ఞతగా చూశాడా... ఎంత బేలగా చూశాడో... పాలు పట్టిన తల్లివైపు పసిపిల్లాడి చూపులా... కాదు కాదు... యితని చూపులో సముద్రంలా పొంగుతున్న నిస్సహాయత... నీమీద ఆధారపడి నిన్ను శ్రమ పెడ్తున్నందుకు క్షమించవూ అనే అర్థింపు...

"యింకేమైనా కావాలా?" అని అడిగింది. అతను తల అడ్డంగా వూపడానికి ప్రయత్నించి, విఫలమై ఏదో అన్నాడు. గొంతులోంచి బుడగల్లా వెలువడిన శబ్దాలు విచ్చుకుని పగిలినట్లు... వింత శబ్దాలు... ఎవ్వరికీ అర్థం కాకున్నా ఆమెకర్థమయ్యే మనోభాష...

"వంట చెయ్యాలి. కిచెన్లో కెళ్తున్నా. ఏమైనా అవసరమైతే కేకేయండి" అంది. వెంటనే ఆ మాట అనాలోచితంగా వచ్చినందుకు కంగారుపడి అతని వైపు చూసింది. అతను కేక వేయలేడని తెలిసి అలా అన్నందుకు బాధ పడ్తాడేమో... ఆమె కంగారుకి కారణం అర్థమైనట్లు అతని చూపులు ఓ క్షణం ఆమె చెంపల్ని తాకి 'పర్లేదులే... నేనేమీ అనుకోను. నిజమే కదా... నేను నీతో మాట్లాడలేను. కబుర్లు చెప్పలేను. పిలవలేను' అన్నట్లు తడితడిగా తడిమాయి.

ఆమెకు దుఃఖం ముంచుకొచ్చింది. అతను చూస్తే మరింత బాధపడ్తాడు. తనకు కన్నీళ్ళలో బాధని కడిగేసుకునే స్వేచ్ఛకూడా లేదు. యిక అక్కడ నిలబడలేక వేగంగా కిచెన్లోకెళ్ళి కొంగు నోట్లో కుక్కుకుని శబ్దం రాకుండా ఏడ్చింది.

ఎలా ఉండే మనిషి ఎలా ఐపోయాడో... ఆ మంచానికి అతుక్కుపోయి ఐదేళ్ళు... జీవచ్ఛవంలా... పెళ్ళి చూపుల్లో తను ఓరగా చూసినపుడు పచ్చటి రంగుతో మెరిసే కళ్ళతో అందమైన రూపురేఖల్తో తనకు కనువిందు చేసిన పాతికేళ్ళ యువకుడు. ఎంతందమైన నవ్వో... వెండి జలతారులా మెరిసే నీటి చెక్కిలిమీద లేలేత సూర్య కిరణాలు నులివెచ్చటి చక్కిలిగిలి పెట్టినట్లు...

'ఏదైనా అడగరా?' వాళ్ళమ్మ కామోసు అతనితో అంది.

'నీపేరేమిటి?' అని అడిగాడతను.

పేరు, పుట్టుపూర్వోత్తరాలు తెల్సుకోకుండానే పెళ్ళి చూపులకొచ్చాడా? తనకు వచ్చిన చిరుకోపాన్ని దాచుకుంటూ 'మొదట మీపేరు చెప్పాక కదా నాపేరు అడగాలి? మీ గురించి చెప్పండి' అంది. అప్పటివరకూ మాటల హోరుతో నిండి ఉన్న ఆ గదిలో ఒక్కసారిగా నిశ్శబ్దం అలుముకుంది.

'తలొంచుకుని కూచుంటే ఏదో అనుకున్నాం. పిల్ల గడుసుదే' అంది వాళ్ళమ్మ.

అతను చిన్నగా శబ్దం వచ్చేలా నవ్వి, 'అడిగింది సబబుగానే ఉంది కదమ్మా. సరే,

నా పేరు శివరాం. మెడికల్ రిప్రజంటేటివ్‌గా పనిచేస్తున్నా. యిపుడు నీపేరు చెప్పటానికి అభ్యంతరం లేదుగా' అన్నాడు.

'సుజాత' అంది తను.

'చాలా అందమైన పేరు' అని అతనన్నప్పుడు ఏదో తెలీని పులకింత...

'మా వూళ్ళో చదువుకున్న అమ్మాయిలే తక్కువ. మా అమ్మాయి డిగ్రీ పాసైంది. చదువుకున్న పిల్ల కదా అలా మాట్లాడినందుకు అన్యధా భావించకండి' నాన్న స్వరంలో వేడుకోలు...

'మేం యింటికెళ్ళాక ఉత్తరం రాస్తాం' అని వాళ్ళమ్మ అంది. వెంటనే అతను 'అప్పటిదాకా వాళ్ళకు సస్పెన్సా... ఎందుకమ్మా... నాకు అమ్మాయి నచ్చింది. మీ అమ్మాయి అభిప్రాయం కూడా తెల్సుకుంటే మనం ముహూర్తాలు పెట్టుకోవచ్చు' అన్నప్పుడు తను తలఎత్తి అతనివైపు చూసింది.

ఆ కళ్ళు తననే చూస్తున్నాయి... అల్లరిగా నవ్వుతూ...

ఆ క్షణం నుంచే అతనంటే యిష్టంతోపాటు అమితమైన గౌరవం ఏర్పడింది.

పెళ్ళయి కాపురానికొచ్చాక తన జీవితంలో ఏడాది పొడుగూతా వసంతాలే... ఎన్నెన్ని స్వర్గాలు విరబూశాయో... ఎన్నెన్ని సుఖాలు తన జీవితంలో పూలవుప్పాడిలా పర్చుకున్నాయో...

యిద్దరాడపిల్లలు పుట్టారు... యిద్దర్నీ యింజనీరింగ్ చదివించి పెళ్ళిళ్ళు చేశారు. అల్లుళ్ళిద్దరూ సాఫ్ట్‌వేర్ యింజనీర్లు... ఒకరు అమెరికాలో సెటిలైతే మరో అమ్మాయి ఆస్ట్రేలియాలో ఉంది. అంతా సజావుగా జరిగిపోతూ ఉందనుకుంటున్న సమయంలో జరగరాని ఘోరం జరిగిపోయింది.

ఆలోచనల్లో ఉన్న సుజాత ఉలిక్కిపడింది. ఆమెకో క్షణం ఏం జరిగిందో అర్థం కాలేదు. ఆసంఘటన గుర్తొచ్చి వళ్ళు జలదరించిందా... లేక ఏదైనా శబ్దం విన్పించిందా... చెవులు రిక్కించింది.

మరలా ఆ శబ్దం విన్పించింది. మరణబాధని అనుభవిస్తున్న జంతువు తన ప్రాణం పోయే ముందు చేసే చివరి గురకలాంటి శబ్దం... తన భర్త ఎందుకో పిలుస్తున్నాడు...

పరుగు పరుగున అతని మంచాన్ని సమీపించింది. అతని మొహంలో బాధ తాలూకు వికృత ఛాయలు...

"ఒకటా రెండా" అంది.

అతని ముఖకండరాల్లో సన్నని కదలిక... స్వరానికి బదులుగా అర్థంకాని ప్రకంపనల వెలువరింతలో అతను పడ్తున్న ప్రసవ వేదన...

"రెండు ఐపోయిందిగా... ఒంటికొస్తుందా?" అంటూ అతని సమాధానంకోసం ఎదురు చూడకుండా మంచం కిందున్న పింగాణీ పాత్రని తీసి అతని కాళ్ళ దగ్గర పెట్టింది. తర్వాత దాన్ని బాత్రూంలోకి తీస్కెళ్ళి, పారబోసి, నీళ్ళతో శుభ్రం చేసి మళ్ళా మంచం కింద పెట్టింది.

"నేను వెళ్ళనా" అంది. అతని కళ్ళలో అంగీకారం చూశాక మరలా వంటగదిలో కొచ్చింది.

పొయ్యిమీద సాంబారు కాగుతోంది... సలసలా... తన గుండె దు:ఖంతో కాగుతున్నట్లు...

ఐదేళ్ళక్రితం... స్కూటర్మీద యింటికి తిరిగొస్తున్న శివరాంని లారీ గుద్దేసింది. స్కూటర్ నుజ్జునుజ్జయింది... శివరాం నాలుగు రోజులు కోమాలో ఉన్నాడు. బ్రతకటం కష్టమని డాక్టర్లు చెప్పారు. వెన్నుపూస బాగా దెబ్బతిన్నందువల్ల బతికినా, యితర్లమీద ఆధారపడి... కదల్లేని పసిపిల్లాడిలా బతకాల్సిందేనని చెప్పారు. కాళ్ళూ చేతులు చచ్చుబడినాయట. వారం తర్వాత ప్రాణాపాయం లేదని చెప్పారు.

తన భర్త కదల్లేకున్నా పర్లేదు బతికుంటే చాలనుకుంది తను. యిన్నేళ్ళుగా తనకు సుఖాల్ని సంతోషాల్ని రాసులుగా అందించిన తన భర్తను పసిపిల్లాడికంటే ఎక్కువగా చూసుకుంటూ... సపర్యలు చేసుకుంటూ కాలం వెళ్ళదీయాలని నిశ్చయించుకుంది.

యింటికి తెచ్చిన పది రోజుల తర్వాత శివరాం మాట్లాడటానికి ప్రయత్నిస్తే గుడగుడ మనే శబ్దం తప్ప మాట బైటికి రాలేదు... అప్పుడొచ్చింది తనకి ఉప్పెనలా దు:ఖం... తన భర్త మందానికి అతుక్కుపోయినా పర్లేదు. తనతో మాట్లాడుతూ ఉంటే చాలనుకుంది. తన మనసులోని బాధని, దుఃఖాన్ని, జ్ఞాపకాల్ని తనతో పంచుకుంటే చాలనుకుంది. చివరికి

తనకా అదృష్టం కూడా లేకుండా పోయింది.

శివరాం అనారోగ్యం కన్నా తనని ఎక్కువగా భయపెట్టిన విషయం ఆర్థిక పరిస్థితి... యిద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయటం వల్ల కూడబెట్టిన సొమ్మంతా హరించుకు పోయింది. స్వంతింటి కల నిజం కాకుండానే ఈ ఉపద్రవం దాపురించింది. అల్లుళ్ళ దగ్గర చేయి చాపటం అవమానంగా భావించి తనే జీవనాధారాన్ని కల్పించుకుంది. కంప్యూటర్ కొనుక్కుని యింగ్లీష్తోపాటు తెలుగు టైపింగ్ నేర్చుకుంది. పుస్తకాలు ప్రింట్ చేసే సంస్థల నుంచి డి.టి.పి. చేసే పనిని కాంట్రాక్ట్ మీద తెచ్చుకుని నెలకు ఏడెనిమిది వేల వరకు సంపాయించుకుంటోంది.

యాక్సిడెంట్ జరిగిన సమయంలో శివరాం డ్యూటీ మీద ఉన్నాడు కాబట్టి కంపెనీ నుంచి కాంపెన్సేషన్ కింద అందిన ఐదు లక్షలు బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ చేయించింది. ఈ ఐదేళ్ళ కాలంలో అతని మందులకోసం, డాక్టర్ల ఖర్చుల కోసం ఆ డబ్బంతా కరిగిపోయింది. ఈ ఐదేళ్ళలో శివరాం చచ్చిపోతే బావుండునన్న ఆలోచన ఎప్పుడూ రాలేదు. శివరాంని చంపేయాలన్న ఆలోచన రావడానికి ఆస్కారమే లేదు. తనకు తన భర్తంటే ప్రాణం కాబట్టి...

నెల్రోజుల క్రితం తనకు రక్తస్రావం కన్పించింది. ఏడేళ్ళక్రితమే మెనోపాజ్ దశకు చేరుకున్న తనకు ఆ రక్తాన్ని చూసి భయమేసింది. శివరాంకి చెప్పకుండా గైనకాలజిస్ట్ దగ్గరకెళ్ళి పరీక్ష చేయించుకుంది. మరికొన్ని టెస్టుల తర్వాత తనకు యుటెరస్ క్యాన్సరుందనీ, బాగా ముదిరిపోయి మిగతా భాగాలకు కూడా పాకిందని డాక్టర్ చెప్పినపుడు తనకు వచ్చిన మొట్టమొదటి ఆలోచన తనకు రాబోతున్న చావు గురించి కాదు.... శివరాం బతుకు గురించి...

తను చనిపోతే శివరాంని ఎవరు చూసుకుంటారు ? అతని మల మూత్రాదుల్ని ఎవరు ఎత్తిపోస్తారు ? ఎవరతనికి స్నానం చేయిస్తారు ? ఎవరు వళ్ళంతా తుడిచి బట్టలు తొడుగుతారు? ఎవరు అన్నం తినిపిస్తారు ? యివన్నీ తనలా ప్రేమగా, అంకితభావంతో చేసేంత మహనీయులు ఎవరుంటారు?

డబ్బులుంటే నర్సుని పెట్టించి చేయించుకోవచ్చేమో... డబ్బే ఉంటే వాటిని తీసుకుని బాగా చూసుకునే వృద్ధాశ్రమాలున్నాయేమో... కానీ తన దగ్గర డబ్బు లేదు. తను సంపాదించే డబ్బే యింటద్దెకీ, తిండి ఖర్చులకీ బొటాబొటిగా సరిపోతుంది. తను చనిపోయినా తన భర్తకు సౌకర్యంగా ఉండాలంటే ఏం చేయాలో అర్థంకాక, చివరికి తన భర్తను చంపెయ్యాలన్న దుర్మార్గమైన ఆలోచన దగ్గర ఆగిపోయింది తను.

ఆలోచనల్ని తెగ్గొట్టి మళ్ళా శివరాం ఉన్న గదిలోకొచ్చింది. నిద్ర పట్టినట్టుంది... కళ్ళు మూసుకుని పడుకుని ఉన్నాడు. అతని మొహంవైపు చూడగానే కట్టలు తెచ్చుకుంటూ పెల్లుబికిన దుఃఖం... ఎంతందంగా ఉండే మొహం ఎలా మారిపోయిందో... తనకు తెలీని కొత్త వ్యక్తెవరో తనింట్లో మంచం మీద పడుకుని ఉన్నట్లు... శరీరం చిక్కి శల్యమై... ఈ శరీరంతోనే కదూ తను మమేకమైంది! ఈ శరీరం వల్లనే కదూ తను యిద్దరు పిల్లలకు జన్మనిచ్చింది! ఆ శరీరం ఈ రోజు... గుర్తు పట్టడానికి వీల్లేనంతగా మారిపోయి...

తను తన భర్తని చంపగలదా... తనకు చేతులొస్తాయా... మనసు ఒప్పుకుంటుందా... యిందాక తను తన ఆలోచనల మెడ నులిమినట్టు శివరాం మెడని కూడా... అమ్మో... మరి మరో దారేది? యిద్దరూ ఆడపిల్లలాయె... తను చనిపోయాక తండ్రి బాధ్యతని నెత్తినేసుకోవడానికి ఏ కూతురైనా ముందుకొచ్చినా అల్లుడు పడనిస్తాడా? అప్పుడు తనకూతురి కాపురంలో కలతలు రావా? వద్దు... అలా జరగడానికి వీల్లేదు. మా జీవితాలెలాగో తెల్లారిపోయాయి. తన కూతుర్ల కాపురాలు పచ్చగా ఉండాలి... వాళ్ళందరూ చల్లంగా ఉండాలి.

ఒక మనిషిని చంపటం అంటే హత్యానేరం కదూ... అందునా తన భర్తని... తను అమితంగా ప్రేమించిన భర్తని... తన ప్రాణంలో ప్రాణంలా చూసుకున్న భర్త ప్రాణాలు హరించటమా... మెర్సీ కిల్లింగ్ తప్పు కాదంటారుగా కొంతమంది... కానీ యిది మెర్సీ కిల్లింగ్ కాదు. మెర్సిలెస్లీ కిల్లింగ్... తన భర్త చావాలని కోరుకోవటం లేదు. అతనిలో బతుకుకాంక్ష తనకు స్పష్టంగా కన్పిస్తోంది.

తన భర్తకు చావంటే చాలా భయం... తనతో చాలాసార్లు చెప్పాడు కూడా... బంధువుల్లో ఎవరైనా చనిపోయినా వెళ్ళి శవాన్ని చూడటానికి భయపడేవాడు... వాళ్ళమ్మ చనిపోయినపుడు నెల్రోజులు మనిషి కాలేక పోయాడు. అతను మంచానికి అంకితమై జీవచ్ఛవంలా బతుకుతున్నా ఏరోజునా చనిపోతే బావుండునన్న ఆలోచన వచ్చినట్లు ప్రవర్తించలేదు. తను కష్టపడ్తున్నందుకు కన్నీళ్ళు పెట్టుకున్నాడు తప్ప ఈ బతుకే వద్దంటూ ఎప్పుడూ విలపించలేదు.

కాబట్టి దీన్ని మెర్సీ కిల్లింగ్ అనడానికి వీల్లేదు. ఐనా తను చంపాలనుకుంటోంది అతని కోసమేగా... .అతని గురించి తీవ్రంగా ఆలోచించాకే కదా ఈ నిర్ణయానికొచ్చింది!

తప్పొప్పుల మాట దేవుడెరుగడా! ఓ వేళ తన భర్తను చంపటం వల్ల పాపఫలాన్ని తనేగా అనుభవించేది... తన భర్త హాయిగా శాశ్వతంగా ప్రశాంత నిద్రలోకి వెళ్ళిపోతాడు. తనకది చాలు...

డబ్బు గురించి ఆలోచన రాగానే ఆమె విపరీతమైన ఉద్రేకానికి లోనైంది. డబ్బు చాలా తుచ్ఛమైందనీ, అనుబంధాలూ ఆత్మీయతల ముందు అది దిగదుడుపనీ యిన్నాళ్లూ అనుకునేది. కాదు... డబ్బు చాలా బలమైంది. ఈ రోజు తన దగ్గర బాగా డబ్బుండి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. తను మంచి వైద్యం చేయించుకునేది. ఓవేళ తను చచ్చిపోయినా ఎవరో ఒకరు తన భర్త అవసరాల్ని తీరుస్తారన్న ఆశ ఉండేది.

మగపిల్లలు లేకపోవడం కూడా ఓ శాపంలా అన్పించింది. కొడుకులైతే పున్నామ నరకం నుంచి రక్షిస్తారో లేదో గాని ముసలితనంలో ఆసరాగానైతే ఉంటారుగా. ఆడ పిల్లలయినా మగపిల్లలయినా ఒక్కటే... ఎవరు పుట్టినా నాకు సంతోషమే అని కదా తను కడుపుతో ఉన్నప్పుడు శివరాం అన్నాడు... ఒక్కటే కాదు... తేడా ఉంది. యిది ఎప్పటికీ పురుషాధిక్య ప్రపంచమే... కూతురి మాట అల్లుడు వింటాడని గ్యారంటీ ఏముంది? నా కూతురు సంపాయిస్తున్నా అందులో మాకు వాటా ఎక్కడుందీ? కొడుకులైతే చొక్కా పట్టుకుని అడగొచ్చు... యింకా వినకపోతే కోర్టుకీడ్చి అడగొచ్చు.

రేపు ఆదివారం... ఏదో ఒకటి చేయాలని నిర్ణయించుకుంది.

ఆ రాత్రి శివరాం పక్కనే కౌగిలించుకుని పడుకుంది. రాత్రంతా ఆలోచనలు... మాగన్నుగా నిద్ర పట్టినా భయంకరమైన కలలు...

ఉదయం లేచి శివరాంకి స్నానం చేయించింది. యిస్త్రీ చేసిన బట్టలు తొడిగింది. శివరాంకి యిష్టమని యిడ్లీలు చేసి అందులో వేరుశనగపప్పు పచ్చడి చేసింది. రెండు యిడ్లీలు తిన్పించాక మంచినీళ్ళు తెస్తానని వంటగదిలో కొచ్చింది.

గ్లాసుని మంచినీళ్ళతో నింపి తను తెచ్చిపెట్టిన సీసాలోంచి నిద్రమాత్రలు గుప్పెడు తీసింది. గ్లాసులోకి నిద్రమాత్రలు వేయబోయి ఆగిపోయింది... తనేం చేయబోతోంది? హత్య... ఓ నిండు ప్రాణాన్ని హరించబోతోంది... చిన్నప్పటినుండీ చీమకైనా హాని తల పెట్టని తను తన భర్తని చంపబోతోంది.

ఆమెకు చేతులాడడం లేదు. మనసంతా మొద్దుబారినట్లు ఐపోయింది. మెదడు

ఇసుగడ్డలా ఘనీభవించినట్లు... యిదేనా పరిష్కారం... మరో పరిష్కారం లేదా... మరొకరి బాధని పంచుకోవాల్సింది పోయి తనా వ్యక్తినే తుంచేయాలనుకుంటోంది. అతని ప్రాణాల్ని తీసే అధికారం తనకెవరిచ్చారు? ప్రాణం పోసినవాడికేగా తీసే అధికారం...

తను చచ్చిపోయాక ఏమైతే తనకెందుకు... తను బతికినన్నాళ్ళు అతన్ని బాగా చూసుకోవచ్చుగా... క్యాన్సర్ ముదిరిపోయిందంటున్నారు డాక్టర్లు... యింకా ముదిరి తను మంచంలో పడిపోతే దిక్కెవరు ? తననెవరు చూస్తారు? తన భర్తనెవరు చూస్తారు! భగవంతుడా... యిటువంటి పరిస్థితి పగవాడిక్కూడా రాకూడదు...

ఆమెకు కన్నీళ్ళు ఉబికాయి. లేదు. తను తన భర్తని చంపలేదు. ఏం జరగబోతోందో జరగనీ... శాసించడానికి తనెవరు... ఆమె మనసు దిటవు చేసుకుని నిద్రమాత్రలున్న చేతిని గ్లాసు పైనుంచి తొలగించబోయింది. అప్పుడే పొత్తికడుపులో విపరీతమైన నొప్పి వచ్చింది. ఆమె నొప్పితో మెలికలు తిరిగిపోయింది. పళ్ళబిగువున భరించే ప్రయత్నం చేసింది. అప్రయత్నంగానే ఆమె కుడిచేతి పిడికిలి విడివడి మాత్రలన్నీ నీళ్ళగ్లాసులో పడిపోయాయి.

శివరాం ఉన్న గదిలోంచి శబ్దం వచ్చింది. మంచి నీళ్ళకోసం... అంతిమ క్షణాల్లో విన్పించే గురకలాంటి శబ్దం...

**(జయంతి త్రైమాసిక పత్రిక - జనవరి, మార్చి 2010)**